

రెప్పల మీద నీడలు

– అత్తలూరి విజయలక్ష్మి



(గత సంచిక తరువాయి)

18

శివ పడుకున్నవాడు చివాల్న లేచి కూర్చుని, పవిత్రని కూడా రెండు చేతులతో బలంగా పైకి లేవనెత్తి కూర్చోబెట్టాడు.

ఆ హఠాత్పరిణామానికి నిశ్చేష్టురాలైంది పవిత్ర. బెడ్ లైట్ వెలుగు పల్చగా పరుచుకుంది గదిలో. ఆ వెలుగులో అతని కళ్ళు కాగడాల్లా వెలుగుతున్నాయి.

"నీకు చెప్పకుండా ఎక్కడికి వెళ్తాడు? చెప్పే వెళ్లి ఉంటాడు. ఆరోజు వాడు వెళ్ళిన రోజు, నా వల్లనే పాపం అతను వెళ్ళిపోయాడు శివా! అంటూ నువ్వు ఏడ్చిన ఏడుపు నాకు తెలియదూ! వాడి మీద ప్రేమ లేకపోతే ఎందుకు బాధపడతావు? బహుశా, సినిమాల్లో హీరో లాగా, బాగా డబ్బు సంపాదించి వచ్చి నిన్ను లేపుకు పోతాను అని నచ్చచెప్పి ఉంటాడు. కదా!" క్రూరంగా నవ్వాడు.

పవిత్ర అవాక్కై చూస్తూ ఉండిపోయింది అతని మొహంలోకి. ఇతనికి పిచ్చి పట్టిందా? ఏం జరుగుతోంది? ఏం ఊహించింది? ఎంత కమనీయమైన సన్నివేశం ఊహించుకుంది. ఇలా మాట్లాడతాడా శివ? ఇదా అతని మనసులో తన పట్ల ఉన్న అభిప్రాయం. ఇది కొత్తగా వచ్చిందా? మొదటి నుంచీ ఇంతేనా? ఆవిడ ఇతని మనసు విషపూరితం చేయడం లేదు కదా! తన మీద అనుమానాలు రేకెత్తించి, తనని, శివని విడదీయాలని అనుకోడం లేదు కదా? అదే నిజమైతే తన శివని కాపాడుకోవాలి. తన సంసారం నిలబెట్టుకోవాలి.

పశువుల్లో అనేక రకాలుంటాయి. గోవులాంటి సాధుజంతువు అయితే, గంగడోలు నిమిరితే మురిసిపోతుంది... సింహంలాంటి రాజసం ఉన్నది అయితే, ఆకలిగొంటేనే మీద పడుతుంది... ఇతను గోవులాంటి వాడూ కాదు, సింహంలాంటి వాడూ కాదు. ఆ విషయం ఇంకా అమాయకురాలు అయిన పవిత్రకి తెలియదు. పాములా పొరలు, పొరలుగా పాత చర్మం ఒలిచి, కొత్త చర్మం తొడుక్కునే ఇతని అసలు స్వరూపం ఆమెకి ఇంకా పూర్తిగా కనపడడం లేదు. అందుకే అతని మాటలు అన్నీ ఏదో అపోహతో అంటున్నాడు అనుకుని, నచ్చచెప్పడానికి ప్రయత్నం మొదలు పెట్టింది.

నెమ్మదిగా అనునయిస్తున్న స్వరంతో అంది" ఎందుకండీ అనవసరమైన నిందలు వేస్తున్నారు నా మీద? మీకు తెలియదా నేనెలాంటి దాన్నో. నాకతనంటే ఎంత అసహ్యమో కూడా మీకు తెలుసు కదా! ఎందుకిలా మాట్లాడుతున్నారు? మీకేమైంది?"

"నాకేమైంది? ఏం కాలేదు. సరదాగా నీ ప్రేమకథ వినాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. ఇప్పుడు అడుగుతున్నా. చెప్పు సరదాగా" అన్నాడు ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

"నా ప్రేమ కథా! ప్రేమ అంటే తెలిసిన మరుక్షణం నుంచీ నా ప్రేమ అంతా మీకే కదండీ ఇచ్చాను. నా ప్రేమ కథ మీకు తెలియదా?"

"నాతో ప్రేమ సరే, ఆ నల్లోడు...అదే నువ్వు, కాకి, కాకి అంటూ వాడు నీ అందం మీద రాసిన ప్రేమ కవిత్వం చెప్పేదానివిగా! ఆ కాకితో నడిపించిన నీ ప్రేమ కథ... చెప్పు, చెప్పు వింటాను" ఆమె గడ్డం పట్టుకుని బతిమాలుతున్నట్టు అన్నాడు.

పవిత్ర పుట్టి పెరిగిన వాతావరణంలో సంస్కారం నేర్చుకుంది కానీ, ఆమెకి సహనం అవసరానికి మించి లేదు. అందుకే చిరాగ్గా చూసింది అతని వైపు.

"ఛీ" అతని చేయి విసిరికొట్టింది. "ఇలాంటి మాటలు మాట్లాడద్దు అంటే వినరేం?" విసురుగా అంది.

"ఈ మాటలు బాగాలేవా? అయితే సరే, మరోలా అడుగుతాను. మీ రంకు భాగోతం చెప్తావా? వింటాను."

నడినెత్తి మీద పిడుగుపడినట్టు కళ్ళు పెద్దవి చేసి అతని వైపు చూసింది. అతని కుటిల మనస్తత్వం అప్పుడప్పుడే అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తుంటే ఒక విధమైన జుగుప్సతో కంపించిపోయింది.

మౌనంగా చూస్తున్న ఆమెని రెచ్చగొడుతున్నట్టు మళ్ళీ అన్నాడు.

"ఏంటి ఆలోచిస్తున్నావు? వీడి కన్నా ఆ మోహన్ నే చేసుకుని ఉంటే బాగుండేదేమో అని ఆలోచిస్తున్నావా? అవునూ! అడగడం మర్చిపోయాను. ఇంటి పక్కనేగా ఉండేవాడు. ఎన్నిసార్లు కలిసారు?"

కోపం అణచుకుంటూ అడిగింది. "కలవడం అంటే?"

ఫక్కున నవ్వాడు. "ఇదివరకు ఈ మాట అడిగితే చిన్నపిల్ల తెలియదు అనుకునేవాడిని. ఇప్పుడు అడుగుతున్నావంటే నువ్వు అమాయకత్వం బాగా నటించగలవు అని అర్థం అవుతోంది. నిజం చెప్పు ఎన్నిసార్లు వాడు నిన్ను ముద్దు పెట్టుకున్నాడు? ఎక్కడ పెట్టుకున్నాడు? ఇక్కడా? ఇక్కడా? అక్కడా?" ఎడం చేతి వ్రేళ్ళు ఆమె మొహం మీద నుంచి, ఒంటి మీదకి పాకిస్తూ అడుగుతోంటే, ఒంటి మీద పాములు పాకుతున్నట్టు అనిపించి దిగ్గున లేచి కూర్చుంది.

"ఓ! కూర్చుని వివరంగా చెప్తావా? చెప్పు, చెప్పు ఎంచక్కా ఓ బూతు కథ వింటాను." అన్నాడు తనూ లేచి కూర్చుని.

పవిత్ర కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. పెదవులు వణికాయి. చివాల్న మంచం దిగి అంది "మీరేం మాట్లాడుతున్నారో అర్థం అవుతోందా?"

అతనూ నింపాదిగా మరో వైపు నుంచి మంచం దిగి, ఆమె వైపు వస్తూ గోడకున్న లైట్ స్విచ్ ఆన్ చేసాడు.

ఒక్కసారిగా వెలిగిన లైటు వెలుగులో ఎర్రగా ఉన్న అతని కళ్ళు చూసి గజగజ వణికిపోయింది పవిత్ర. కణకణ మండుతున్న నిప్పు కణికల్లా ఉన్నాయి.

ఆమెకి బాగా దగ్గరగా వచ్చి, ఆమె రెండు భుజాలు నొక్కి పట్టుకుని కళ్ళల్లోకి తీక్షణంగా చూస్తూ మరోసారి అడిగాడు "చెప్పు. ఆ నల్లవెధవ ఎక్కడున్నాడు?"

భుజంమీద సుత్తితో గట్టిగా వత్తుతున్నట్టుగా ఉన్న అతని చేతుల స్పర్శకి ఆమె భుజాలు మంట పెట్టసాగాయి. దానికి తోడు అతని ప్రశ్నలు గుండెల్లో నిప్పురవ్వల్లా తగులుతోంటే, నిస్సహాయంగా అతని కళ్ళల్లోకి చూస్తూ, పెదవులు వణుకుతుండగా "పదే పదే మీరెందుకు అతని ప్రస్తావన తీసుకువస్తున్నారు? అతని గురించి నాకేం తెలుసు? అతను ఎక్కడికి వెళ్ళాడో అసలు తెలియదు... ప్లీజ్ నమ్మండి" అంది ప్రాదేయపడుతున్న స్వరంతో.

క్రూరంగా నవ్వాడు. "నేనేమి అనను. ఉంటె ఉంది వాడితో నీకు... కాకపోతే ఆ అనుభవం నాకూ చెప్పమని అడుగుతున్నా. చెప్పడానికేం? నాకు ఇలాంటి కబుర్లు వినడం అంటే చాలా ఇష్టం... అంటూనే స్వరంలో కాటిన్యం తెచ్చుకుని, "చెప్పవే" " అన్నాడు గట్టిగా.

"అరవకండి. అవతల ఆవిడ ఉన్నారు. వింటారు" అంది. ఈ రభసకి సరళ ఎక్కడ లేచి వస్తుందో, ఆమె ముందు అతనిలా మాట్లాడితే తనెంత చులకన అవుతుందో అని భయం వేసింది. కానీ, సరళ పీకలదాకా తాగిన మత్తులో ఒళ్ళు మరిచి నిద్రపోతోంది.

"వినవే. తనకీ సరదానే నీ బూతు కథ వినడం అంటే. పిలవనా?" గుమ్మం వైపు వెళ్ళబోతున్న అతన్ని పట్టుకుని వెనక్కి లాగి, "మీకేం అవుతోంది? ఎందుకిలా మాట్లాడుతున్నారు? పడుకోండి. రేపు ఉదయం మాట్లాడుకుందాం " అంది.

"ఛీ, ఛీ, ఇలాంటివన్నీ రాత్రిళ్ళు మాట్లాడుకుంటేనే రంజుగా ఉంటాయి. నాకు చాలా ఇష్టం కూడా" అన్నాడు.

"కానీ నాకు అసహ్యం. దయచేసి, అలా మాట్లాడకండి. ఎంత ఆశతో, ఎంత ఉత్సాహంతో మీకు మనం అమ్మా,నాన్నలం అవుతున్నాం అని చెప్పాలని మీకోసం ఎదురుచూసాను. నా ఆనందం అంతా ఇలా ఆవిరి చేస్తారా? ఎందుకు చెప్పానా అని బాధపడేలా హింసిస్తారా?" దుఃఖంతో వణుకుతున్న స్వరంతో అంది.

"హింసించడమా? ఎంతమాట! నీ మనసులో దాచుకున్న మధురస్మృతులు నాకూ చెప్పమని అడుగుతున్నాను. అయినా, నీకోసం ప్రాణం కూడా ఇచ్చేయడానికి సిద్ధపడినవాడికి ఏమి ఇవ్వకుండా ఎలా ఉన్నావు? నేను నమ్మను. కచ్చితంగా మీ ఇద్దరికీ మధ్య మంచి రొమాంటిక్ కథ నడిచింది. ఆ మధురమైన అనుభవాల గుర్తుగా నువ్వు తల్లివి కాబోతున్నావు. వాడు తండ్రి కాబోతున్నాడు. మరి ఈ శుభవార్త వాడికి చేరేయద్దూ! అందుకే అడుగుతున్నా. వాడెక్కడ

ఉన్నాడో చెప్పు. నేను వెళ్లి వాడి నోట్లో స్వీట్ పెట్టి, ఇక్కడికి ఆహ్వానిస్తాను. నాకున్న మంచి మనసు ఎవరికీ ఉంటుంది చెప్పు!"

పవిత్రకి ఆ మాటతో అప్పటివరకు గుండెల్లో గడ్డ కట్టిన దుఃఖం తన్నుకు వచ్చింది. రుద్ధమైన స్వరంతో అంది "ఇది మంచి మనసా? దీన్ని మంచి మనసు అంటారా? మిమ్మల్ని ప్రేమించి, అమ్మా, నాన్నలను మోసం చేసి, కాలేజ్ ఎగ్గొట్టి మీరు రమ్మన్నప్పుడల్లా మీ ఇంటికి వచ్చాను... మీరు ఎక్కడికి రమ్మన్నా రాను అని చెప్పకుండా మీ వెంట తిరిగాను. మీరే నా సర్వస్వం అనుకుని చదువు కూడా నిర్లక్ష్యం చేసాను. ఆరోజు మీరేం అన్నారు? పెళ్లి అయ్యాక చదువు కంటిన్యూ చేసి, డిగ్రీ అన్నా సంపాదించు, లేకపోతే నా హోదాకి అవమానం అన్నారు. మనం కాపురం మొదలుపెట్టి నెల కూడా కాకుండా నన్ను అనేక రకాలుగా అవమానిస్తూ, నా కదలికల మీద నిబంధనలు పెట్టి, మా నానమ్మని తీసుకు వస్తానంటే వద్దని ఎంత బాధ పెడుతున్నారు? అయినా నేనేమి అనలేదు. మీరేం చెబితే అది చేస్తున్నా. ఆఖరికి, ఆవిడనెవరినో మీ పిన్ని అని చెప్పి తీసుకుని వచ్చి ఇంట్లో పెట్టారు. మీ ఇద్దరి సంబంధం నాకు తెలియదు అనుకున్నారా? మీలాగా నేను వావి, వరసలు లేకుండా బతకను. నాకో క్రమశిక్షణ ఉంది. నీతి ఉంది... నాకు, అమ్మా, నాన్నా, నానమ్మా అందరూ ఉన్నారు. ఒక కుటుంబం ఉంది... నేనేం దిక్కుమాలిన దాన్ని కాను... మాకో సంస్కారం ఉంది...మాకో..." ఆమె మాట పూర్తి కాకుండానే అతని చేయి గాల్లోకి లేచి ఆమె చెంపని బలంగా తాకింది.

ఒక బూతు మాట తిట్టి, "నీకెంత కండకావరం? చెప్పు...నిన్ను వదలను. వాడెక్కడ? చెప్పు" అంటూ ఆమె గొంతు పట్టుకున్నాడు. అతని చేయి బిగుసుకునే లోపలే ఆమె అతన్ని తోసేసి, విసురుగా గదిలో నుంచి బయటకు వెళ్ళిపోబోతుంటే బలమంతా ఉపయోగించి ఆమెని ఎత్తుకుని, ఒక చేత్తో లైట్ ఆర్పి మంచం మీద తోసేసాడు.

ఆమెని ఆనుకుని కూర్చుని, రెండు చేతులూ ఆమెకి అటూ, ఇటూ వేసి, ఆమె మొహంలోకి వికృతంగా చూస్తూ అన్నాడు,.

"మనం కలిసి నెల కూడా కాకుండా నీకు నెల తప్పింది అంటే నమ్మడానికి నేను వెధవలా కనిపిస్తున్నానా? చెప్పు వాడెక్కడ?" అతని స్వరంలో క్షణ,క్షణానికీ తీవ్రత పెరుగుతోంది. ఆ స్వరం, అతని కళ్ళు ఆమె ధైర్యాన్ని సన్నగిల్ల చేస్తుంటే, సుడిగాలికి ఊగే చిగురాకులా కంపించిపోసాగింది. భయంగా అంది.

"మీరేం మాట్లాడుతున్నారో మీకు అర్థం అవుతోందా? అతను నా వెంటపడుతున్నాడని, ప్రేమ అంటూ వేధిస్తున్నాడని మీకే కదా చెప్పాను. మీ ఎదురుగా అతన్ని ఎన్నోసార్లు అవమానించాను... తిట్టాను. అన్నీ తెలిసి మీరిలా మాట్లాడడం ఏంటండి? ఎందుకిలా మాట్లాడుతున్నారు? మీకేమైంది?"

"నీ అసలు రూపం తెలిసింది."

పవిత్రకి అంత బాధలో కూడా నవ్వొచ్చింది. "నా అసలు రూపమా?నవ్వింది. "గొర్రెతోలు కప్పుకున్న తోడేలు రూపం ఎవరిదో నాకూ ఇప్పుడే తెలిసింది. నేను తప్పు చేసాను. మీకు ఒక అందమైన అనుభూతిని కలిగించేలా శుభవార్త

చెప్పాలని తపించాను. మీలో భావుకత ఉందనుకున్నాను. మీది సున్నితమైన మనసు అనుకున్నాను. మీరు సింహం అనుకున్నాను. కానీ మీరు హైనా.''

ఈ మాటలని తన భుజం మీద ఉన్న అతని చేతులు బలవంతంగా తప్పించి, బ్లాంకెట్ మీదకి లాక్కుని దిండుమీద వాలుతుండగా అనూహ్యంగా అతని కుడి చేయి మరోసారి ఆమె చెంపని బలంగా తాకింది. పవిత్ర కెవ్వుమంది. ఆమె నోరు మూస్తూ కఠినంగా అన్నాడు.

''తప్పుడు పని చేసింది కాక, నాకు ఎదురు సమాధానం చెప్తావా? నన్ను జంతువులతో పోలుస్తావా?తాగుబోతు అంటావా? ఎంత ధైర్యం నీకు? పెళ్ళికాక ముందు, నేను ముద్దు పెట్టుకుంటే, పతివ్రతలా పెళ్లి కాకుండా వద్దండి అని నంగనాచి కబుర్లు చెప్పి, వాడితో పడుకున్నావా? కాకి, కాకి అంటూ ఆ కాకితో కడుపు చేయించుకున్నావు. ఇంత చేసినా నిన్ను నేను వదలను. నీ మీద నాకింకా మోజు పోలేదు. అందుకే వదలను. పైగా నా భార్య అనే స్థానంలో ఉన్నావు కాబట్టి, నీకా స్థానం పదిలంగానే ఉంచుతాను. కానీ, చూడూ! ఇక నుంచీ నేనేం చేసినా, ఎక్కడికి వెళ్ళినా, ఎవరితో వెళ్ళినా కిక్కురుమనకుండా పడి ఉండు. నోరేత్తావా! ఖబడ్దార్...'' పశువులా ఆమె మీద పడ్డాడు.

తనకు కావాల్సిన సుఖం బలవంతంగా పొంది, క్షణాల్లో గురక పెడుతున్న అతని వైపు కళ్ళు తెరిచి చూసే ఓపిక కూడా లేని పవిత్ర కుమిలి, కుమిలి ఏడుస్తూ , ఎప్పుడో తెల్లవారుజామున నిద్రలోకి జారుకుంది.

వీపు మీద గట్టిగా బాదుతూ ''ఏయ్! లే ఏంటి మీ ఆయన రాత్రంతా నిద్రపోనీలేదా?'' అని అడుగుతూ నిద్ర లేపింది సరళ.

బరువుగా ఉన్న రెప్పలు బలవంతంగా తెరిచింది పవిత్ర.

ఎదురుగా సరళ. నిద్రలేవగానే ఆమె మొహం కనిపించడంతో పవిత్రకి నీరసం వచ్చేసింది. లేవాలనిపించలేదు. ఆమె లాగి పడేసిన బ్లాంకెట్ మీదకు లాక్కుని, తిరిగి కళ్ళు మూసుకుంది.

''ఏంటి మళ్ళీ పడుకుంటున్నావు? మీ ఆయన హాస్పిటల్ కి వెళ్ళాలి. కాఫీ, టిఫిన్ చేయవా?'' గదమాయిస్తున్నట్టుగా అంది సరళ.

పవిత్రకి ఆమె ఇంక తనని పడుకోనివ్వాడు అని అర్థం అయింది. నెమ్మదిగా పక్కకి ఒత్తిగిల్లి అంది. ''లేస్తాను మీరు వెళ్ళండి.''

''ఏం? నిద్రలేచి నా మొహం చూడవా? మంగళ సూత్రాలు కళ్ళకద్దుకో. పతివ్రతవి కదా!'' వెటకారంగా అంది.

పవిత్ర అసహనంగా లేచింది. సరళ ఆమె మొహంలోకి పరిశీలనగా చూస్తూ, ''అబ్బో! రాత్రి మీ ఆయన నీ బుగ్గలు కోరికేసినట్టున్నాడే! రసికుడే. రాత్రంతా నిద్రపోనీకుండా ...''

''ఆపండి.'' ఆమె మాట పూర్తికాకుండా పవిత్ర విసురుగా లేచి, బాత్ రూమ్ వైపు వెళ్ళిపోయింది.

ఆమె మొహం కడుక్కుని, స్నానం చేసి వచ్చేసరికి, శివా, సరళా సోఫాలో పక్క,పక్కనే ఆనుకుని కూర్చుని నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

పవిత్రని చూడగానే శివ అన్నాడు. "మహారాణిగారు ఇప్పుడే లేచినట్టున్నారు. ఆలస్యం అయింది కదా అని మా మొహాన ఉప్మా పడేయకుండా, పూరీ, కూరా చేయి. ముందు మాకు కాఫీ ఇవ్వు" .

పవిత్ర మౌనంగా వంటగదిలోకి వెళ్ళిపోయింది. ఆమె మనసు, కళ్ళు రెండూ భగభగ మండుతున్నాయి. ఆమెకే శక్తి ఉంటె కాఫీ వేడి చేయడానికి వేరే స్టవ్ తో పని ఉండేది కాదేమో! కప్పు గుండె మీద పెట్టుకుంటే, మసిలిపోయేది.

పవిత్రకి రాత్రి జరిగిన రభస మనసులో నుంచి పోవడం లేదు. ఎంత బాగా నటిస్తున్నాడు? నటించేదేముందిలే అసలు రూపం బయట పడింది కాబట్టి, ఆ రూపం తోటే తిరిగేస్తాడు ఇంక. చెప్పాడుగా! ఏం చేసినా నోరు తెరవద్దని.

కాఫీ కప్పుల్లో పోసి తీసుకుని వెళ్లి వాళ్ళు కూర్చున్న సోఫా ముందు ఉన్న టీ పాయ్ మీద పెట్టి, నిశ్శబ్దంగా తిరిగి వంట గదివైపు నడిచింది.

"అరగంటలో పూరీ కావాలి" అన్నాడు అధికారికంగా.

పవిత్ర ఆగి, మెడ మీదుగా వెనక్కి తిరిగి సరళని చూస్తూ అంది "మీరొచ్చి పూరీ ఒత్తి ఇవ్వండి. నేను కాలుస్తాను."

ఆమె ధైర్యానికి విస్తుబోయిన సరళ శివ వైపు చూసింది.

"ఏం? నీకు రాదా?" కోపంగా అన్నాడు శివ.

పవిత్ర పూర్తిగా వాళ్ళ వైపు తిరిగి అంది. "పాపం! మీకు తన చేత్తోనే ఒండిపెడితే ఇష్టం అని ఆవిడ నాకు రెండు, మూడుసార్లు చెప్పారు. అందుకే కొడుక్కి ఇష్టమైన పూరీ తన చేత్తో ఒత్తుతారని". కొడుక్కి అన్న అక్షరాలు ఒత్తి పలికింది.

సరళ, శివ మొహాలు చూసుకున్నారు. ఇద్దరి మొహాలు రంగుమార్చుకున్న ఊసరవెల్లిలా అనిపించాయి పవిత్రకి. ఏదో అనబోతున్న శివని ఆపుతూ "దానిదేముంది? ఒత్తిస్తాలే" అంటూ కాఫీ తాగసాగింది సరళ. పవిత్ర పెదవుల మీద కనిపించీ, కనిపించని చిరునవ్వు మెరిసింది.

వెనక్కి తిరిగి, తల ఎత్తుకుని, ఠీవిగా నడిచి వెళ్ళిపోయింది.

"దీనికి పొగరు బాగా తలకెక్కింది" శివ స్వరం,

"ష్...ఇప్పుడెం మాట్లాడకు." అంటూ సున్నితంగా హెచ్చరిస్తున్న సరళ స్వరం ఆమె చెవుల్లోకి దూరాయి.

వంటగదిలోకి వెళ్ళిపోయి, గోధుమ పిండి తీసి, కలిపింది. కుక్కర్ లో పొటాటో పెట్టింది.

పొటాటో ఉడికేలోపల, ఉల్లిపాయ తరిగింది. ఎందుకో పొరలు, పొరలుగా విడిపోతున్న ఉల్లిపాయ శివలా అనిపించింది.

కూర పూర్తి అయేసరికి వంట గదిలోకి వచ్చింది సరళ. ఆమె ఊపిరి పాము బుసలా వినిపించి ఓ క్షణం ఉలిక్కిపడిన పవిత్ర, తనని తాను తమాయించుకుని, అప్పడాల కర్ర, పీట ఆవిడ ముందు పెట్టింది.

ఇద్దరిమధ్యా మాటలేం జరగలేదు. ఆవిడ మనసులో నిశ్శబ్దంగా కొన్ని ప్రణాళికలు రూపు దిద్దుకుంటుంటే, పవిత్ర మనసులో అక్కడి నుంచి గుడివాడ వెళ్ళిపోడానికి దారులు ఆలోచిస్తోంది.

సరిగ్గా నలభై నిమిషాల్లో శివ, సరళ పూరీలు తిని, మరోసారి కాఫీ తాగి వెళ్తోంటే పవిత్ర తన సందేహం నిర్మొహమాటంగా బయట పెట్టింది. "మీరు హాస్పిటల్ కి వెళ్ళడం లేదా?".

శివ ముందు కొంచెం ఉలిక్కిపడ్డాడు. తరవాత నిర్లక్ష్యంగా అడిగాడు "ఏం? నీకెందుకు?"

"ఆవిడని కూడా వెంట పెట్టుకుని వెళ్తోంటే అడిగాను" .

సరళ చురుక్కుమని చూసి, "నీ పని చేసుకో. అనవసరమైన ప్రశ్నలు వేయకు" అంది.

పవిత్ర ఆమె కళ్ళల్లోకి సూటిగా చూసి నవ్వింది.

సరళ ఆ నవ్వుకి బెదిరినట్టు, తల వంచుకుని శివతో పాటు బయటకి నడిచింది. పవిత్ర వాళ్ళు గేటు కూడా దాటక ముందే తలుపు పెద్ద శబ్దంతో దడాలున వేసి, అక్కడే సోఫాలో కూలబడి, రెండు చేతుల్లో మొహం దాచుకుని బోరుమంది.

ఆమెకి నానమ్మ కళ్ళ ముందు కదులుతూ, "అయ్యో నా తల్లీ, ఎంత కష్టం వచ్చిందే... నేనున్నాను రా తల్లీ" అని పిలుస్తున్నట్టు అనిపిస్తోంది. గబగబా లేచి కళ్ళు తుడుచుకుని గదిలోకి వెళ్లి, మంచం కింద నుంచి సూట్ కేసు లాగింది. అలమరలో ఉన్న చీరలు లాగి, అన్నీ సూట్ కేసులో కుక్కేసింది. తన నగలు కూడా తీసుకోబోతుంటే, గుర్తు వచ్చింది, చంద్రహారం, నెక్లస్, కొన్ని గాజులు సరళ ఎక్కడ పెట్టిందో అడగాలనుకున్న విషయం.

అవి ఆమెకి వదిలి వెళ్ళడమా? ఎలా అడగాలి? ఆలోచిస్తూ బొమ్మలా నిలబడిపోయింది. తలుపు చప్పుడు అవడంతో అలమర తలుపు వేసేసి, సూట్ కేసు మూత వేసి, హాల్లోకి నడిచి, కిటికీ లోంచి తొంగి చూసింది. వెంకటమ్మ నిలబడి ఉంది. ఊపిరి పీల్చుకుని, తలుపు తీసింది.

వెంకటమ్మ లోపలికి వచ్చి, అటూ, ఇటూ చూసి, పవిత్ర వైపు చూసి, "వీళ్ళు వెళ్ళిపోయారా?" అన్నట్టు సైగ చేసింది.

పవిత్ర తలుపు గడియవేసి, " వెళ్ళారు అని చెప్పి, ఇలారా అంటూ గదిలోకి తీసుకుని వెళ్ళింది.

మంచం మీద సూట్ కేసు చూసి, "ఎవరోచ్చారమ్మా? అనడిగింది వెంకటమ్మ.

"ఎవరూ రాలేదు. నేనే వెళ్తున్నాను మా పుట్టింటికి" అంది పవిత్ర ముభావంగా.

"పుట్టింటికా? ఎందుకు? " ఆశ్చర్యంగా పవిత్ర మొహంలోకి చూసిన వెంకటమ్మ ఆమె చెంపలు కంది ఉండడం, కళ్ళు ఎర్రగా ఉండడం చూసి "ఏమైందమ్మా?" అనడిగింది.

ఆమె స్వరంలో వినిపించిన ఆప్యాయతకి, చలించిపోయింది పవిత్ర. శ్రావణ మేఘంలా మారింది. కన్నీళ్లు కారుతోంటే, వెక్కిళ్ళు పెడుతూ రాత్రి జరిగినదంతా తల్లికి చెప్పుకున్నట్టు, చెప్పుకుంది. అంతా విని, కదిలిపోయిన

వెంకటమ్మ, కరుణతో దగ్గరకి తీసుకుంటే, అమ్మ ఒడిలో సేదతీరినట్టు ఆమె గుండెల మీద సేద తీరుతూ, "నేను వెళ్ళిపోతాను వెంకటమ్మా! నన్ను మా ఊరి బస్ ఎక్కించవా? ప్లీజ్" అంది.

"తప్పకుండా ఎక్కిస్తానమ్మా. కానీ, ఆ రాక్షసిని ఇక్కడ వదిలి మీరు ఎల్లిపోతే మీ కాపురం నాశనం అయిపోతుంది. ఎంత చెడ్డా, పెళ్లి అయాక బర్తే దిక్కు కదమ్మా. బర్తను వదిలేసి ఎల్తే మీ పుట్టింతాల్లు రానిస్తారా? ఆల్లు కాదంటే తిరిగి ఈడకే రావాలి కదా! ఆలోసించమ్మా! ఆవేశపడితే ఆడదానికే నస్టం అని మీకూ తెలుసు. ఆలోసించండి." నచ్చచెపుతున్నట్టుగా నెమ్మదిగా చెప్పింది.

"ఆలోచించినా ఇంతకన్నా మార్గం కనిపించడం లేదు. నన్ను అనుమానించారు ఆయన. నేనలాంటి దాన్నా! ఇప్పుడు మొదలైన ఈ అనుమానం తొమ్మిది నెలలే కాదు, పిల్లో, పిల్లాడో పుట్టినా, వాళ్ళు కళ్ళ ముందు ఉన్నంతకాలం అనుమానిస్తూనే ఉంటారు. ఎంత నరకం అనుభవించాలి చెప్పు" అంది ఏడుస్తూ.

"అవును తల్లీ. నువ్వు చెప్పింది వాస్తవం అయినా, ఆడదానికి తప్పవు ఈ బాదలు"

"ముందు నానమ్మ దగ్గరకి వెళ్లి, ఇదంతా చెప్తాను. ఆవిడే ఒక పరిష్కారం చూపిస్తుంది. ఆయన్ని పిలిచి బుద్ధి చెప్తుంది. నాన్న నాలుగు తిడతారు. అప్పుడన్నా బుద్ధి వస్తుంది. నన్ను బస్ ఎక్కించు వెంకటమ్మా" జాలిగా అంది పవిత్ర.

వెంకటమ్మ ఒక నిర్ణయానికి వచ్చిన దానిలా చెమర్చిన కళ్ళు పైట చెంగుతో ఒత్తుకుంటూ "పదమ్మా." అంది సూట్ కేసు తీసుకుని.

పవిత్ర తన హ్యాండ్ బాగ్ తీసుకుంది. బొట్టు సరిచేసుకుంది, తల దువ్వుకుని జడల్లుకుంది. బాగ్ లో డబ్బులు చూసుకుంది. చీర సరిచేసుకుని, వెంకటమ్మ వెనకాల నడిచింది.

ఇద్దరూ బయటకు వచ్చి తలుపుకు తాళం వేసి, తాళం చేతులు కిటికీ తలుపు ఒక రెక్క తీరిచి లోపల వైపు పెట్టారు.

అప్పుడే అటుగా వెళ్తున్న ఖాళీ రిక్షా పిలిచింది వెంకటమ్మ.

బస్ స్టాండ్ అని చెప్పి ఇద్దరూ కూర్చున్నారు.

రిక్షా, వాళ్ళనీ, వాళ్ళ గుండెల్లో బరువునీ మోస్తూ ముందుకు కదిలింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS